telugubooks

# ప్రగల్భాలు

అడవిలో పోతుంటే పిల్లికి నక్క ఎదురొచ్చింది. ఇద్దరూ ఒకరి కష్టసుఖాలు మరొకరికి చెప్పుకోసాగారు.

"మనశ్శాంతితో నిశ్చితంగా గడిపే రోజే లేదు. ప్రతిరోజూ ఎవరు ఏ క్షణాన ప్రాణం తీసేస్తారోనని భయం భయంగా బ్రతకాల్సిందే జీవితాంతం" వాపోయింది పిల్లి.

"కాని నేనటువంటి భయానికి పొరబాటున కూడా నా జీవితంలో తావియ్యను. నువ్వు చెప్పినంత దుర్భరంగా జీవితం తయారైనా తప్పించుకోవటానికి నా దగ్గర వందల కొద్దీ ఉపాయాలు ఉన్నాయి" గర్వంగా అంది నక్క.

"నువ్వు చాలా అదృష్టవంతురాలివి. నాకు తప్పించుకోవడానికి తెలిసింది ఒక్కటే మార్గం - పారిపోవడం! ఒక వేళ అలా పారిపోలేక పోయానూ అంటే ప్రాణాలు కోల్పోవలసిందే!" బాధపడింది పిల్లి.



'ఎంతయినా నువ్వు నా మిత్రుడివి కదా! శత్రువుల చేతిలో నుండి తప్పించుకోడానికి కొన్ని ఉపాయాలను చెబుతాను విను...' గొంతు సవరించుకొని చెప్పబోయింది నక్క.

ఇంతలో ఓ వేటకుక్క హఠాత్తుగా వాటిమీదికి దూకింది.

పిల్లి తనకి తెల్సిన ఒకే ఒక్క ఉపాయాన్ని ఉపయోగించి చటుక్కున పక్కనున్న చెట్టు ఎక్కి కూర్చుంది.

తనకి తెలిసిన వందలకొద్దీ ఉపాయాల్లో ఒక్క ఉపాయాన్ని ఆలోచించుకోనివ్వకుండా చటుక్కున నక్క మెడ కొరికేసింది వేటకుక్క. మాకే తెలివి తేటలున్నాయని విర్రవీగడం ఎప్పుడూ మంచిది కాదు. ప్రగల్భాలు అసలు పలుకకూడదు!

***